
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 9 ఏప్రిల్ 2025

మిస్సింగ్ సిటిజన్స్ **గుర్తింపు**

- ఎట్టకేలకు ఛేదించిన సచివాలయాల సిబ్బంది
- ఇప్పటికే 6.45 లక్షల మందిని గుర్తించి సచివాలయాలకు మ్యాపింగ్
- ఇంకా 5 వేల మంది ఆచూకీ కోసం వెతుకులాట



8



గ్యాస్ వడ్డన.. రూ.90 కోట్లు

- వినియోగదారులపై పెరిగిన భారం
- రెండేళ్ల తర్వాత వంట గ్యాస్‌పై వడ్డన
- ఉజ్వల, దీపం లబ్ధిదారులనూ వదలని ప్రభుత్వం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండేళ్ల తర్వాత వంట గ్యాసు సిలిండరు ధర పెంచారు. గ్యాసు ధర పెరగడంతో సామాన్య కుటుంబాలపై భారం పడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 18 లక్షల కుటుంబాలకు వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడు ఏడాదికి 8 నుంచి 10 సిలిండర్లు వినియోగిస్తారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై ఏటా రూ.500 భారం పడుతోంది. ఇలా 18 లక్షల మందిపై ఏడాదికి రూ.90 కోట్ల మేర అదనంగా భారం పడనున్నది. ఉజ్వల, దీపం పథకాల కింద కనెక్షన్లు తీసుకున్న వారిని కూడా ఈ సారి ప్రభుత్వం వదల్లేదు. దీంతో వారు కూడా ఈ గ్యాస్ భారం మోయాల్సి వస్తోంది. వంటగ్యాసు ధరల భారాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చి సామాన్యులపై భారం తగ్గిస్తోంది. కానీ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం మోపేలా చేస్తుండడంతో వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సామాన్యులు గగ్గోలు..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు ధరలు డజనుసార్లు పెరిగాయి. 2014 నాటికి 7 పదుల్లో ఉన్న ఆయిల్ ధరలు 2020 నాటికి 120 రూపాయల వరకూ వెళ్లింది. కరోనా కష్టాలతోపాటు, లాక్‌డౌన్ నష్టాలతో అల్లాడిపోయిన ప్రజలు ఆయిల్ ధరల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేంద్రం ధరలు తగ్గించింది. వంటగ్యాసు ధర 2014 నాటికి రూ.430 ఉండగా, 2023కి రూ.1200కి చేరింది. దీంతో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 2024 ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రూ.200 ధర తగ్గించి ప్రజల ఆగ్రహ జ్వాలను చల్లార్చింది. కాగా మళ్లీ ఇప్పుడు ధరలు పెంచడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ధరల పెంపుదల ఇంతటితో ఆగుతుందా.. లేక ఇంకా ఇంకా కొనసాగుతుందా.. అన్న భయం వారిని వెంటాడుతోంది. 2014- 16 మధ్య కేంద్రం 9 సార్లు ధరలు పెంచిన నేపథ్యంలో ఆ పరిస్థితిని తలుచుకుని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.

ఆస్తి పన్ను.. మళ్లీ పెరిగింది

- మున్సిపాల్టీల్లో 15 శాతం పెరుగుదల
- ఐదేళ్లలో రెట్టింపు అయిన ఆస్తి పన్ను
- 1 నుంచి అమల్లోకి వచ్చిన పెంచిన పన్ను
- మూడు జిల్లాల్లో భారం రూ.60 కోట్లు పైగానే

మున్సిపల్ కేంద్రాల్లోని ఇళ్ల యజమానులపై మళ్లీ పన్ను భారం పడింది. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను మరో సారి 15 శాతం పెరిగింది. ఈ పెంచిన పన్నులను ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల మూడు జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.60 కోట్లకు పైగానే ఆస్తి పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటేటా పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానమయ్యే వరకు పన్ను పెరుగుతునే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో మోయలేని పడుతున్న ఆర్థిక భారం మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోతుండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ ప్రజలపై మరోసారి ఆర్థిక భారం పడింది. ఏటా పన్నుల పెంపుదల పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మర్చేసింది. మార్కెట్ విలువ(రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి పన్నును విధించింది. ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా మున్సిపాల్టీల్లో అధికారులు ఆస్తి పన్ను నిర్ణయించారు. గతంలో అద్దె విలువ, మున్సిపాల్టీలో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునేవారు. మున్సిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తున్నది. ఆస్తి విలువ ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15 శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి తన గతంలో ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా ఐదో ఏడాది కూడా పన్ను పెరిగింది. ఇలా పెరిగిన పన్నుతో అ ది రూ.990కి చేరింది. అంటే నాలుగేళ్లలో ఆ వ్యక్తిపై అదనంగా రూ.498 పన్ను భారం పడింది. గుంటూరు కార్పొరేషన్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు ఉంటే ఈ పన్ను ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.115కు పెరిగింది. అంటే మిగిలిన మున్సిపాల్టీల్లోనూ ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

50 శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50 శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరు నెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీను పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్ను దారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.

కొనసాగుతున్న వైసీపీ పన్ను విధానం

మున్సిపాల్టీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15 శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వంలో పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. అయితే ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు ఈ నెలలో పెరిగిన 15 శాతం పన్నుతో తేలింది. గత నాలుగేళ్లుగా పెంపుదలతో ఇప్పటికే పన్ను భారం ప్రతీ ఒక్కరిపైనా రెట్టింపు అయింది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

5 శాతం రాయితీ

పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5 శాతం రాయితీ అమలు చేస్తోంది. సోమ వారం నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. పన్ను రూ.100 ఉంటే రూ.5 రాయితీ ఇస్తారు. రాయితీపై ఆస్తి పన్ను చెల్లించేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చారు. పన్ను రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా వచ్చి పన్నులు కడుతున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లోనే రూ.6.60 కోట్లు వసూలు కావడం గమనార్హం.



ఆస్తి పన్ను లక్ష్యం రూ.522.28 కోట్లు

గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు లక్ష్యం రూ.522.28 కోట్లు. ఈ మొత్తంలో బకాయిలు భారీగానే ఉన్నాయి. పల్నాడు జిల్లా పన్ను వసూ లు లక్ష్యం రూ.77.03 కోట్లుగా ప్రభుత్వం నిర్ణ యించింది. గుంటూరు జిల్లాల్లో రూ.406.97 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.38.28 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా ఉంది.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పంపిణీ ప్రారంభం
- ఒక్కో విద్యార్థికి రూ.3 వేలకిపైగా భారం నుంచి ఊరట
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 వేల మందికి లబ్ధి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 8 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ ఏడాది కూడా ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 30 పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్లస్ టూ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ చదివే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలల పునః ప్రారంభం కాగా కళాశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను అధ్యాపకులు అందజేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారే. పుస్తకాలకు విద్యార్థులు రూ.3 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రెండేళ్లుగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ చేపట్టింది. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, రికార్డులు పంపిణీ వల్ల ఆర్థికంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతగా మారింది. పుస్తకాలను ఉచితంగా అందజేయడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందని ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు.

ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం

ప్రభుత్వం ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం చుడుతుంది. ఈ నేపథ్యంలోనే నూతన సంస్కరణలు ప్రవేశపెడుతున్నది. తొలుత ఇంటర్ విద్యార్థులకు కూడా కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జేఈఈ అడ్వాన్స్‌తో పాటు ఎంసెట్ శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆయా శిక్షణలకు గుంటూరులోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంస్కరణలు విద్యార్థుల అడ్మి షన్లు పెంపుకోసమేనని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.

8

ఎంఈవోల **వసూళ్ల దందా**

- విధులు విస్మరించి ఇద్దరు అధికారుల ఇష్టారాజ్యం

గుంటూరు మీదగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు

6

టూరిజం మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ అధికారిగా పద్మారాణి

నేడు వెలగపూడిలో సీఎం చంద్రబాబు ఇంటికి భూమి పూజ

ఉదయం 8.50 గంటలకు ముహూర్తం

6

సేవలపై సంతృప్తి

- ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలపై పెరిగిన భరోసా!
- పనితీరుపై 74.14 శాతం, మందుల పంపిణీపై 79 శాతం సంతృప్తి
- ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలు వెల్లడి



8



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- సమన్వయంతో అధికారులు పనిచేయాలి
- వేసవి దృష్ట్యా చెరువులను నీటితో నింపండి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం అమరావతిలోని ఏవీఆర్ కల్యాణ మండపంలో కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో సాగునీటి పారుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. 36 ఎత్తిపోతల పథకాలకు 12 మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన వాటిని కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులను నీటితో నింపాలన్నారు. పూడికతీత పనులు చేపట్టాలని, చెరువులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరగకుండా, కూలీలకు ఉపాధి లక్ష్యంగా పనిచేయించేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించేలా పర్యవేక్షించాలన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నియోజకవర్గంలో నిలిచిపోయిన రహదారుల పనులు సత్వరం పూర్తి జరిగేలా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అమరావతి-బెల్లంకొండ, అమరావతి-తుళ్లూరు రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలానికి 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు మండలానికి రెండు సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం సంపూర్ణంగా జరగడం లేదని అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అమరావతిలో నిరుపయోగంగా ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేసి లక్ష్యానికి అనుగుణంగా గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ 2025-2026 సంవత్సరానికి రూపొందించిన జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, డీఆర్వో మురళి, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ.. లేఅవుట్

- హద్దు రాళ్లు తొలగింపు.. రిజిస్ట్రేషన్ల నిలుపుదల
- నరసరావుపేట మున్సిపాల్టీలో 13 అక్రమ లేఅవుట్ల గుర్తింపు





సాయినగర్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపాల్టీ పరిధిలోని అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలో మొత్తం 13 అక్రమ లేఅవుట్లను గుర్తించారు. సదరు వెంచర్ల నిర్వాహకులకు మున్సిపాల్టీ నోటీసులు జారీ చేసింది. అయితే సంబంధిత లేఅవుట్లకు చెందిన వారు నోటీసులకు స్పందించ లేదు. దీంతో అధికారులు ప్రత్యక్ష చర్యలకు దిగారు. ఈ క్రమంలో మంగళవారం మున్సిపల్ అధికారులు సత్తెనపల్లిరోడ్డులోని సాయినగర్‌లోని లేఅవుట్ హద్దు రాళ్లను తొలగించారు. ఆయా లే అవుట్లలో రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా పట్టణ పరిధిలో వెంచర్లు వెలిశాయి. ఈ వెంచర్లలో రిజిస్ట్రేషన్ల నిలుపుదలతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందు తున్నారు. రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసిన వెంచర్ల వివరాలను రిజిస్ట్రార్ కార్యాలయం విడుదల చేసింది. సత్తెనపల్లి రోడ్డులోని సర్వే నెంబరు 63లో 5.60 ఎకరాలు, అదే రోడ్డులోని సర్వే నెంబరు 34లో 1.38 ఎకరాలు, ఎస్ఆర్‌కేటీ కాలనీ ప్రాంతంలోని 269లో 5.10 ఎకరాలు, 270, 275లోని 12.30 ఎకరాలు, 289లో 7.19 ఎకరాలు, కోటప్పకొండరోడ్డులోని 288, 290 సర్వే నెంబర్లలోని 14.20 ఎకరాలు, 303, 306 లో 12.52 ఎకరాలు, 277లో 4.45 ఎకరాలు, వల్లప్ప చెరువు ప్రాంతంలోని 493, 494లో 5.25 ఎకరాలు, 495లో 3.45 ఎకరాలు, 498/బీ1లో 3 ఎకరాలు, గుంటూరు రోడ్డులోని 2/1లో 3 ఎకరాలు రిజిస్ట్రేషన్ నిలుపుదల చేసిన జాబితాలో ఉన్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా స్థిరాస్తి వ్యాపారులు అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జస్వంత్ సూచించారు. అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొని నష్టపోవద్దని తెలిపారు. ప్లాట్లను కొనుగోలు చేసే ముందు లేఅవుట్‌కు అప్రూవల్ ఉందో లేదు పరిశీలించుకోవాలన్నారు.

నేడు వెలగపూడిలో సీఎం ఇంటికి భూమి పూజ

ఉదయం 8.50 గంటలకు ముహూర్తం

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రెవెన్యూలో ఈ- 6 రోడ్డు వెంట ఉన్న ఐదెకరాల స్థలంలో నిర్మించుకునే ఇంటికి సీఎం చంద్రబాబునాయుడు బుధవారం భూమి పూజ చేయనున్నారు. కుటుంబ సమేతంగా ఆయన కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఉదయం 8.50 గంటలు ముహూర్త సమయంగా పండితులు నిర్ణయించారు. దీంతో చంద్రబాబు ఆ సమయంలో భూమి పూజ చేయనున్నారు. ప్రైవేటు కార్యక్రమం కనుక రాజధాని రైతులతో సహా ఎవరికి ఆహ్వానం లేదు. అయితే వెలగపూడి గ్రామస్థులు పట్టు వస్త్రాలు పెట్టాలని సిద్ధమవడంతో పోలీసులు అనుమతి లేదని చెప్పారు. కుటుంబసభ్యులతో చేసుకునే ఈ కార్యక్రమానికి ఆటంకం కలిగించవద్దని మంగళవారం పోలీసులు వెలగపూడి గ్రామం లో తిరిగి ప్రజలకు సూచించారు.

ఎక్సైజ్‌స్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిధిలో వైన్ షాపులు, బార్ల పరిస్థితి గురించి వాకబు చేశారు. దుకాణాల పని వేళల పాటింపు, మద్యం అమ్మకాలు, నమోదైన కేసుల గురించి



వివరాలు తెలుసుకుంటున్న ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

తెలుసుకున్నారు. చిలకలూరిపేట స్టేషన్ పరిధిలో రెవెన్యూ, వివిధ రకాల ఎక్సైజ్ నేరాల గురించి సమీక్షించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వినయ్‌కుమార్‌కు పలు విషయాలపై సూచనలు చేశారు. స్టేషన్ కానిస్టేబుళ్ళతో మాట్లాడి వారి రోజువారీ విధుల గురించి తెలుసుకుని, మెరుగైన పనితీరు గురించి తగు సూచనలు చేశారు. ఈ సమీక్షలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పల్నాడు జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే మణికంఠ, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే రవీంద్ర పాల్గొన్నారు.

1,41,802 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,44,443 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,41,802 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 66,917 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13300	సింజెంటా		
273	--	--	బ్యాడిగి 5531	--	--
341	10500	13900	దేవనూరు డీలక్స్	10300	13200
4884	10000	11800	ఆర్మూరు	9800	11000
సూపర్ 10	--	--	తాలుకాయలు	4500	6400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10200	13500			

రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించాలి

● వీసీ ఆర్ శారదా జయలక్ష్మీదేవి

తాడికొండ(లాంఫాం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు, జీవ నియంత్రణ పద్ధతులు సమష్టిగా పాటించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆర్ శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు రక్షణ వేదిక వారు ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు, ఎలా అనే అంశంపై చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రైతులు మితిమీరి, విచక్షణా రహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల వల్ల సాగు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. ఎగుమతులకు అనువుగా ఉన్న, అధిక దిగుబడి, ఆదాయాన్నిచ్చే పంటలు పండించాలని తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ సాగు ఖర్చులు తగ్గించాలని, రైతు స్థాయిలో విత్తనోత్పత్తి జరగాలని విత్తన సాధికారిత సంపాదించాలని తెలిపారు. కౌలు రైతులకు ప్రోత్సహకాలు ఉండాలని, బయోడైవర్సిటీ, కమ్యూనిటీ సీడ్ డెవలప్‌మెంట్, పాతతరం విత్తనాలను సంరక్షించుకోవాలని సూచించారు. సుస్థిర వినియోగం, సంప్రదాయ వ్యవసాయ విధానాలు, కమ్యూనిటీ సీడ్స్ బ్యాంకులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం, ఎందుకు, ఎలా అనే అంశంపై డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రైతు రక్షణ వేదిక సభ్యులు కొల్లా రాజమోహన్‌రావు, హైదరాబాద్‌కు చెందిన డెవలప్ మెంట్ ఎకనామిక్స్ నేషనల్ ప్రొఫెసర్ డీ నరసింహారెడ్డి, సెంటర్ ఫర్ సస్టెయిన్‌బుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ బీవీ రామాంజనేయులు, బీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రైతు ప్రత్యామ్నాయ వ్యవసాయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి తదితరులు

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

బెల్లంకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతిచెందిన సంఘటన నందిరాజుపాలెంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనలో బెల్లంకొండ మండలం మాచాయపాలెం విద్యుత్ లైన్‌మన్ మర్రి నరసింహారెడ్డి(33) మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం మర్రి నరసింహారెడ్డి స్వగ్రామం బెల్లంకొండ మండలం పాపాయపాలెం. నందిరాజుపాలెంలోని శివాలయం సమీపంలో 11కేవీ విద్యుత్ లైన్‌పై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మర్రి నరసింహారెడ్డికి భార్య, సామ్రాజ్యం, కుమార్తెలు మణిప్రియ, వైష్ణవిలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పోలవరం- బనకచర్లతో చంద్రబాబు భగీరథ ప్రయత్నం

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం, బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నానికి శ్రీకారం చుడుతున్నారని, కరువురహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ఇది తొలి అడుగని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జలహారతి కార్పొరేషన్‌తో దశాబ్దాల దాహార్తిని తీర్చే ప్రగతి యజ్ఞానికి ముఖ్యమంత్రి నాంది పలికారన్నారు. పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు కోసం కంపెనీ చట్టం కింద వందశాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుచేస్తున్నారన్నారు. పల్నాడు ప్రాంతంతో పాటు ప్రకాశం, రాయలసీమ ప్రాంతాల్లో తరతరాలుగా పీడిస్తున్న కరువును తీర్చే బృహత్తర ప్రాజెక్టుగా పోలవరం - బనకచర్ల అనుసంధానం రూపు దిద్దుకుంటుందన్నారు. అలాంటి గొప్ప లక్ష్య సాధనకోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు పల్నాడు ప్రజలు తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పోలవరం- బనకచర్ల లింక్‌లో భాగంగా బొల్లాపల్లి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపడతారని దాని ద్వారా తమ ప్రాంత ప్రజలకు తాగునీరు సాగు నీరుతో సమస్య తీరటంతోపాటు, భూగర్భ జలాలు కూడా భారీగా పెరుగుతాయని హర్షం వ్యక్తం చేశారు. అటు గోదావరి, ఇటు కృష్ణా నదుల జలాలతో రెండు పంటలు పండించుకుంటూ పల్నాడు ప్రాంతం సస్యశ్యామలం కానుందని, బీడు భూములు పచ్చటితోరణంలా మార నుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందడంతో పల్నాడు ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.80వేల కోట్ల రూపాయలతో చేపట్టబోయే పోలవరం-బనకచర్ల భారీ ప్రాజెక్టు పూర్తయితే కరువు ప్రాంతాలైన పల్నాడు ప్రాంతంతో పాటు ప్రకాశం, రాయలసీమలకు నీటి సమస్య శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రాజెక్టుల రూపంలో రాష్ట్ర ప్రలజ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్య మంత్రి చొరవకు పల్నాడు ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు.

భార్య మృతి తట్టుకోలేక భర్త మరణం





మృతిచెందిన ఆశీర్వాదం, సామ్రాజ్యం (ఫైల్)

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 8: భార్య మరణం తట్టుకోలేక మనోవేదనకు గురై గుండె పోటుతో భర్త మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గత కొంత కాలంగా పట్టణంలోని నిడుబ్రోలులో అన్నవరపు ఆశీర్వాదం(85), అన్నవరపు సామ్రాజ్యం(76) దంపతులు నివసిస్తున్నారు. ఆశీర్వాదం ఆర్మీలో పని చేసి పదవీ విరమణ చేశారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా ఇద్దరు కుమారులు గతంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆశీర్వాదం, సామ్రాజ్యం దంపతులు అనారోగ్యం బారిన పడ్డారు. సామ్రాజ్యం పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందింది. భార్య మరణంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం తెల్లవారుజామున ఆశీర్వాదం కూడా గుండెపోటుతో మరణించాడు. దంపతుల మృతి వార్త తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మృతుల బంధువులను ఫోన్‌లో పరామర్శించారు. టీడీపీ నాయకులు జాగర్లమూడి సుధీర్, పొన్నగంటి వాసు, ఆరే ప్రసాద్, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, సీతారామయ్య, వెంకటేశ్వరరావు, అహ్మద్‌ఖాన్ తదితర టీడీపీ నాయకులు దంపతుల మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07325 హుబ్లీ - కతిహార్ ప్రత్యేక రైలు ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతీ బుధ వారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు మీదుగా గురువారం వేకువజామున 3.20కి గుంటూరు, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కతిహార్ చేరుకుంటుంది. నంబరు. 07326 కతిహార్ - హుబ్లీ రైలు ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతీ శనివారం మధ్యాహ్నం మధ్యాహ్నం 2.15కి బయలుదేరి ఆదివారం రాత్రి 9.10కి గుంటూరు, సోమవారం ఉదయం 10.50కి హుబ్లీ చేరుకుంటుందని శ్రీధర్ తెలిపారు.

డెలివరీ బాయ్స్ వివరాలను.. ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్ తమ వివరాలను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని 18-59 మధ్య వయస్సు కల్గిన వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ సభ్యత్వం పూర్తిగా ఉచితమన్నారు. వివరాలకు 94925 55164 నెంబరును సంప్రదించాలన్నారు.

టూరిజం మార్కెటింగ్,కమ్యూనికేషన్స్ అధికారిగా పద్మారాణి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నాదెండ్ల ఎంపీడీవో ఎస్ పద్మారాణి ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ అధికారిగా నియమితులయ్యారు. డిప్యూటేషన్‌పై ఆమె అక్కడ పనిచేయనున్నారు. పద్మారాణిని జడ్పీ సీఈవో వీ జ్యోతి బసు విధుల నుంచి రిలీవ్ చేశారు.

జనరేటర్ తగిలి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి), ప్రమాదవశాత్తు జనరేటర్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని అల్లం సెంటర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు. పట్టణంలోని శివ సంజీవ కాలనీకి చెందిన వై రామకోటేశ్వరరావు (46) మోటార్ సైకిల్‌పై ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతున్నాడు. బస్టాండ్ వైపు నుంచి టాటా ఏస్ వాహనానికి జనరేటర్ తగిలించుకొని వస్తున్నారు. టాటా ఏస్ వాహనం నుంచి జనరేటర్ ఊడి ఎదురుగా వస్తున్న రామకోటేశ్వరరావుకు తగిలింది. తలకు తీవ్ర గాయం అవ్వడంతో రామ కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 20న ప్రవేశ పరీక్ష

రెంటచింతల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 20వ తేదీన పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ మోహన్ తెలిపారు. ఐదో తరగతిలో 40 సీట్లు, ఆరో తరగతిలో 10 సీట్లు, 9వ తరగతిలో 9 సీట్లు ఉన్నాయి. రోస్టర్ ప్రకారం రిజర్వేషన్‌ను అమలు చేస్తామన్నారు. రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు చూపి సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల రేషన్ కార్డు జతజేసి అందజేయాలన్నారు.

నేడు ఆలయ భూముల వేలం

రెంటచింతల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ఆంజనేయస్వామి ఆలయ భూములకు బుధవారం శివాలయం కల్యాణ మండపంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు. మూడు సంవత్సరాలు కౌలు చేసుకునే వారు రూ.5 వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. 58 సర్వే నంబరులో 8.40 ఎకరాలు, 525 సర్వే నంబరులో 6.90 ఎకరాలున్నాయన్నారు.

నేడు ప్రజాదర్బార్

వెల్దుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యాన ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీతోపాటు ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబరు వెంట తీసుకురావాల్సి ఉంది.

బకాయిలు విడుదల చేయాలి

సత్తెనపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మిక సంఘాలకు చెల్లించాల్సి బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ చేనేత కార్మిక సంఘం నాయకులు మంగళవారం అన్ని సచివాలయాల్లో సిబ్బందికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.150 కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పతంగి ప్రభాకర్, బీ పానకాలు, దుర్గ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చేజర్లలో నాటు సారా స్వాధీనం

నకరికల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నవోదయం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేజర్ల గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు చేయగా ఇద్దరు మహిళల వద్ద నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కే సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ లక్ష్మీ, సిబ్బంది భూపాల్‌రెడ్డి, రమణకుమారిలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో ఇద్దరు న్యాయవాదులపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. న్యాయవాద పరిరక్షణ చట్టాలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, సయ్యద్ అబ్దుల్ రహీం, కే వెంకటేశ్వరరావు, బీ సంగీతరావు, బీ శ్రీనివాసరావు, పీ రాజు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త భూలోకం మృతి

మాచర్ల రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌కు చెందిన మత్స్యకారుడు, జనసేన కార్యకర్త సురడా భూలోకం అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనసేన నేతలు విజయపురిసౌత్‌కు చేరుకొని భూలోకం భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మట్టిఖర్చుల నిమిత్తం మృతుడి కుటుంబసభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు, మండల అధ్యక్షుడు గుండెబోయిన సాంబశివరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు వైసీపీ కార్యకర్త బెదిరింపు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వస్తే ఎగరేసి నరుకుతా అంటూ టీడీపీ నేత ఇంటికి వెళ్లి వైసీపీ కార్యకర్త బెదిరించిన ఘటన మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో జరిగింది. నాగులవరం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త జక్కుల రంగబాబు పొలం పక్కనే బెల్లంకొండవారిపాలెంకు చెందిన టీడీపీ నేత చిరుమామిళ్ల మల్లయ్య పొలం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో మల్లయ్య పొలం నుంచి వర్షపు నీరు కిందకు వెళ్లకుండా రంగబాబు తన పొలంలో గట్టును ఏర్పాటు చేశాడు. తన పొలం నీటిలో మునిగిపోతుందని, గట్టును తొలగించాలని పలుమార్లు రంగబాబు కోరినా స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెద్ద సమక్షంలో గట్టును తీసివేసి వివాదాన్ని పరిష్కరించారు. దీన్ని మనసులో పెట్టుకున్న రంగబాబు గత సోమవారం మల్లయ్య ఇంటికి వెళ్లి మా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిన్ను ఎగరేసి నరుకుతానంటూ బెదిరిస్తూ, దూషిస్తూ హల్‌చల్ చేశాడు. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రంగబాబును అరెస్టు చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహ్మద్ షఫి తెలిపారు.

కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలి : రూరల్ సీఐ

నకరికల్లు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పీ కిరణ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం రాత్రి ఆయన నకరికల్లు పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్ఐ సురేష్‌తో కేసుల గురించి, స్థానిక సమస్యల గురించి, రోడ్డు ప్రమాదాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే వారితో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

- మూడెకరాల భూమి ఆక్రమణ, అమ్మకాలు
- రెవెన్యూ శాఖ అనుమతి లేకుండానే లేఅవుట్లు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు



వైసీపీ నేత కబ్జా చేసిన ప్రభుత్వ భూమి

కారంపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి కనబడిదంటే వైసీపీ నేతలు గద్దల్లాగా అక్కడికి వెళ్లి ఆక్రమించడం పరిపాటిగా మారింది. పట్టణంలోని వినుకొండ రోడ్డుకు వెళ్లే రహదారి పక్కన సుమారు మూడు ఎకరాలు భూమిని కబ్జాదారులు ఆక్రమించి రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ2 కోట్లను దండుకుంటున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎక్కడ ప్రభుత్వ భూమి ఉందని తెలిసినా దర్జాగా భూమిని కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాజకీయ నేతలమని చెప్పుకుంటూ గత వైసీపీ ప్రభుత్వ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్మకాలు సాగించారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో ప్రభుత్వ అవసరాల నిమిత్తం ప్రభుత్వ భూమి చూద్దామన్నా కనపడని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ భూకబ్జాలో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ పోరంబోకుతోపాటు ఇరిగేషన్‌శాఖకు సంబంధించిన సుమారు మూడు ఎకరాల భూమిని ఓ వైసీపీ నేత దర్జాగా కబ్జా చేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి అమాయక ప్రజలకు స్థలాలను సెంట్లు చొప్పున అమ్మినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరించడంతో పలు విమర్శలకు దారి తీస్తోంది. కూటమి నేతలు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మౌనం వహించడం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

పెదకూరపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రధానంగా మిరప పంటల వైపే దృష్టి సారిస్తున్నారని, ఉద్యాన పంటల సాగు వైపు కూడా దృష్టి సారిస్తే అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని కాశిపాడు గ్రామంలో ఉద్యాన పంటలైన బొప్పాయి, డ్రాగెన్ ఫ్రూట్స్, అవకాడో, జామ తోటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన రైతు అడప అంజనేయులు బొప్పాయి సాగులో ఎకరానికి వెయ్యి మొక్కలు నాటానని, దిగుబడి 40 టన్నులు రాగా కిలో పది రూపాయలు చొప్పున రూ.1.50 లక్షలు ఖర్చులు పోగా రూ.2.50 లక్షలు ఆదాయం పొందినట్టు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఉద్యాన అధికారి తోట శ్రీనిత్య, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అత్తలూరులో రైతులు పకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో రమణాకాంత్ రెడ్డిలు పరిశీలించారు. ముందుగా అమరావతిలో జరిగిన సమావేశంలో పకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సీజీఎస్ సర్టిఫికెట్లు, పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం బాటలో నడిచి వారి ఆరోగ్యాన్ని, భూముల ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.



మాదలలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

చిన్నారులతో క్రికెట్ ఆడిన కలెక్టర్

అత్తలూరు గ్రామ శివారులోని పొలాల్లో క్రికెట్ ఆడుతున్న చిన్నారుల వద్దకు కలెక్టర్ వెళ్లి వారితో కలసి క్రికెట్ ఆడారు. చిన్నారులు బౌలింగ్ చేయగా అరుణ్‌బాబు బ్యాటింగ్ చేసి వారిని ఆనందపరిచారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని సాయంత్రం మాత్రమే ఆడుకోవాలని వారికి హితబోధ చేశారు.

వేసవిలో కూలీలందరికీ పని కల్పించాలి

ముప్పాళ్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి హామీ పథకం కింద పనిని కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మాదలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో వసతులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డ్వామా పీడీ సిద్ధాలింగమూర్తి, తహసీల్దార్ ఎం భవానీశంకర్, ఏపీడీ వెంకటనారాయణ, ఏపీవో ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

పశువుల దాహార్తిని తీర్చేందుకే నీటితొట్లెలు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. మండలంలోని నంది గామలో నిర్మాణం పూర్తి చేసుకున్న నీటి తొట్టెను మంగళవారం ఆయన పరిశీలించారు. నీటి తొట్టెల నిర్మాణం వల్ల మూగజీవాలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో ఏపీడీ, డ్వామా పీడీ, ఈవోపీఆర్‌డీ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

దేవదాయ భూములపై విచారణ

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపూడి గ్రామంలో గల దేవదాయ భూములపై కలెక్టర్ క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని దేవదాయ భూములపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించే ప్రజావేదికలో గుడిపూడి గ్రామానికి చెందిన గంధం శ్రీకాంత్ ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ ఫిర్యాదు దారుడితో మాట్లాడారు. అతను సమర్పించిన రికార్డులను, అధికారుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్టప్రకారం దేవదాయ భూముల విస్తీర్ణం నిర్ధయిస్తామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణకాంత్ రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, దేవదాయశాఖ అధికారులు ఉన్నారు.

జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి



జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

క్రోసూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 2025 - 26 జాబ్ క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విడుదల చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు తెలియజేశారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా జాబ్ క్యాలెండర్‌ను, గోడ పత్రికలను విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని యువతీ యువకులందరూ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలను, జాబ్ క్యాంపులను సద్వినియోగించుకోవాలని మంత్రి కోరినట్టు తెలియజేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ ప్రాంతాలతో పాటు మరి కొన్ని కేంద్రాల్లో కూడా తరచుగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు అనేక కంపెనీల ప్రతినిధులను పిలిపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు తమ్మాజీరావు తెలియజేశారు.

అభాగ్య శిశువులకు అండగా 'ఊయల'

మున్సిపల్ చైర్మన్ నరసింహారావు



ఊయల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

మాచర్లటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అభాగ్య శిశువులకు అండగా ఊయల మిషన్ వాత్సల్య పథకం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మంగళవారం మహిళల అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, శిశు గృహ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యాన పట్టణంలోని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఊయలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎవరైనా బిడ్డను వద్దనుకుంటే రోడ్డు పక్కన, కాలువలోను, చెత్త బుట్టలోను పడవేయవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, రామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ చైర్మన్ నరసింహారావు పట్టణంలోని 31వ వార్డులో పర్యటించారు. ప్రజల నుంచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఆయన వెంట కమిషనర్ వేణుబాబు, సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల వినతి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న చలో విజయవాడలో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆప్కాస్ సంస్థను రద్దు చేసి, కాంట్రాక్ట్ ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే విధానాన్ని వ్యతిరేకించాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరుతూ తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వినతిపత్రం అందించిన మున్సిపల్ కార్మికుల్లో కొండలు, ఆంజనేయులు, గంగాధరరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా రథోత్సవం

దాచేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సుమారు ఐదు వందల సంవత్సరాలు చరిత్ర కలిగిన పెదగార్లపాడులోని కల్యాణ దంపతులైన సీతారాములను రథంపై ఉంచి భక్తులు రథాన్ని లాగారు. మంగళవారం అనాదిగా, సంప్రదాయంగా వస్తున్న కల్యాణ మూర్తులను రథంపై ఉంచి గ్రామంలో భక్తులు రథాన్ని లాగటం ఆనవాయితీ. ఏళ్ళ తరబడి వస్తున్న ఆనవాయితీలో భాగంగా దేవదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి, దాతలు, భక్తుల సహకారంతో రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ ధరోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వాసవ్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో 15 మంది మహిళలకు 9 రోజులపాటు ఉచితంగా శిక్షణనిచ్చి కుట్టుమిషన్లు, సామగ్రి, శిక్షణకు సంబంధించిన బుక్స్‌ను అందించారు. మండలంలోని కొండమోడు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉషా సోషల్ సర్వీసు, ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉషా కంపెనీ ఆదాయంలో 2 శాతం మహిళా సాధికారతకు వచ్చిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కోఆర్డినేటర్ కోన శివయ్య, పణితి రవి, చాట్ల సునీల్, దొండపాటి రాజేష్, శ్రీనివాసరావు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

● ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి

దుర్గి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆకుల ఆశాజ్యోతి మంగళవారం తెలిపారు. ఈనెల 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫౌండేషన్ ద్వారా నోట్‌బుక్స్, బ్యాగ్‌ను అందజేశామన్నారు.

మహిళల ధర్నా

పిడుగురాళ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాల మధ్య సున్నం మిల్లులు, బొగ్గు, బ్రిక్స్ తయారీ కంపెనీ సామగ్రి రంగుల మిల్లుల నుంచి వచ్చే దుర్వాసనతో నివాస గృహాల్లో ఉండలేక అనారోగ్యం బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సంజీవరెడ్డినగర్ వాసులు మంగళవారం అద్దంకి నార్కెట్‌పల్లి రహదారిపై ధర్నా నిర్వహించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం మంగళవారం నాటికి 516.00 అడుగులు ఉంది. ఇది 142.08 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 2053, ఎడమ కాలువ ద్వారా 4881, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 3931, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 12,665 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నేడు క్రోసూరులో వైద్యశిబిరం

క్రోసూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలియజేశారు. కాటూరి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుభవజ్ఞులైన వైద్యబృందంచే వైద్యశిబిరంలో సేవలు అందజేస్తారన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు గైనకాలజీ, గుండె, ఎముకులు, చెవి, ముక్కు, గొంతు, ఆప్తమాలజీ, తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు, ఈసీజీలు కూడా చేస్తారన్నారు. మండలానికి చెందిన ప్రజలందరూ ఆధార్ కార్డుతో రావాలని పిలుపునిచ్చారు.

యువికా - 2025కు విజయపురిసౌత్ విద్యార్థి

మాచర్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన యువికా (యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం) 2025 కు మండలంలోని విజయపురిసౌత్‌లో గల ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థి పి.వెంకటనాగార్జున ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

రాజుపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పి.విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని రెడ్డిగూడెం, చౌటపాపాయపాలెం గ్రామాల్లో ఉన్న ప్రైవేటు మద్యం షాపుల్లో ఆయన ఎస్ నాగలక్ష్మీ, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

మాచర్లటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మండలపరిధిలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశమై సూచనలు చేశారు. పెండింగ్ ఈకేవైసీని పూర్తి చేయాలన్నారు.

ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం

కారంపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అనే చందాన మారింది కారంపూడి ఎంపీటీసీల పరిస్థితి. ఓ పక్క ప్రభుత్వం ఎంపీటీసీల గౌరవ వేతనం మంజూరు చేసినప్పటికీ అధికారులు మాత్రం వాటిని ఎంపీటీసీ బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది మార్చి నెల వరకు గౌరవ వేతనం ఎంపీటీసీల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని అధికారుల చెప్పుంటే ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ గౌరవ వేతనం ఎంపీటీసీ ఖాతాలలో జమ కాలేదు. ఇటీవల ఒకరిద్దరు ఎంపీటీసీలు గౌరవ వేతనం నిధులు గురించి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని అడుగగా నిధులు జమ చేశామని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నాయని సమాధానం చెప్పారు. ఇదిలా ఉండగా జిల్లాలోని కొన్ని మండలాల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందించగా కారంపూడి మండలంలో మాత్రం అందుకు భిన్నంగా కనపడుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి గౌరవ వేతనం అందేలా చూడాలని ఎంపీటీసీలు కోరుతున్నారు.

రైతు సాధికారతకు కూటమి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయానికి, రైతు సాధికారతకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తిలో మంగళవారం వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా మంజూరైన పనిముట్లను రైతులకు అందించారు. 30 తైవాన్ స్ప్రేయర్లు, 20 రోటవేటర్లు, 20 కల్టివేటర్లను 20మంది లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవో లక్ష్మారెడ్డి, టీడీపీ నేతలు వెంకట్రామిరెడ్డి, రామాంజిరెడ్డి, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మాచర్లటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని.. యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాల గ్రౌండ్‌లో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి సందడి చేశారు. ఈనెల 18వ తేదీన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, పులుసు రఘునాథరెడ్డి, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, మున్నా రాంబాబు, కొమెర శివ, బండ్ల బ్రహ్మం, గొట్టిపాళ్ల మధుయాదవ్, షేక్ అన్వర్, లాలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

దాచేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ళ వానతో నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం తడిచి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తడిచిన ధాన్యం నష్టపోయిన రైతులు మాట్లాడుతూ ఆరు గాలం శ్రమించి పండించిన పంట ఒకటి రెండు రోజుల్లో మార్కెట్‌కు తరలించే తరుణంలో అనుకోకుండా వచ్చిన గాలి వానతో నష్టపోయినట్లు వివరించారు. సుమారుగా వెయ్యి క్వింటాళ్ల ధాన్యం వానకు తడిచి పోయినట్టు వివరించారు. ముఖ్యంగా వీరాపురం, శాంతినగరం, దాచేపల్లి గ్రామాలకు చెందిన రైతులు నష్టపోయిన వారిలో అధికంగా ఉన్నారు. ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



నారాయణపురంలో డీసీసీ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి హాజరైన వైద్యులు, రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

దాచేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని దాచేపల్లి ప్రభుత్వ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ అమూల్య తెలిపారు. మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కే సాంబశివరావు, అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కడప శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి సుమారు 300 మంది హాజరై ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులను తీసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బ్యాంకు సిబ్బంది, పట్టణ ప్రముఖ వైద్యులు, కౌన్సిలర్ ఎం శ్రీనివాసరావు, తోట వెంకట్రామయ్య, మైనార్టీ నాయకులు తుల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



దూదేకుల సిద్ధయ్య (ఫైల్ ఫొటో)

రెంటచింతల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లి వస్తూ బైకు అదుపుతప్పి కింద పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మిట్టగుడిపాడు అడ్డరోడ్డు వద్ద జరిగింది. ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మిట్టగుడిపాడుకు చెందిన దూదేకుల సిద్ధయ్య(35) మంగళవారం పాలువాయిలో ఓ వివాహానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మిట్టగుడిపాడు అడ్డరోడ్డు వద్ద 167ఏడీ జాతీయ రహదారిపైకి రాగానే బైకు అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెంటచింతల పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడికి భార్య సైదాబి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడు ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన విత్తన దుకాణంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భార్య సైదాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని రాయవరం జంక్షన్ సమీపంలో మంగళవారం జరిగింది. దుర్గి మండలం పోలేపల్లికి చెందిన నామసాని మురళి వివిధ పనులపై మాచర్లకు వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. అలాగే మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన బేరాల నరసింహారావు దుర్గి నుంచి ద్విచక్ర వాహనంపై తాళ్లపల్లి వస్తున్నాడు. వీరిద్దరి ద్విచక్ర వాహనాలు రాయవరం జంక్షన్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మురళి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి పోలీస్ రక్షణ కల్పించాలి

సత్తెనపల్లిరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడి వేధింపులకు గురైన కంకణాలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త టి.స్వర్ణలత కుటుంబానికి ప్రభుత్వం పోలీస్ రక్షణ కల్పించాలని ఐద్వా, కేవీపీఎస్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శులు గుట్టుపల్లి రజిని, జి.రవిబాబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్వర్ణలతను పరామర్శించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేకుండా తన తమ్ముడి కుమారుడికి అంగన్‌వాడీ సెంటర్ ద్వారా రావాల్సిన పోషకాహారం ఇవ్వాలని టీడీపీ నేత వెంకటేశ్వర్లు స్వర్ణలతను బెదిరించటం, లైంగికంగా వేధించడం దుర్మార్గమని అన్నారు. రిమాండ్‌కు వెళ్లిన ముద్దాయి బయటకు వస్తే తన కుటుంబానికి ఏమి జరుగుతుందోననే భయం స్వర్ణలతలో ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పోలీస్ రక్షణ కల్పించాలన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి : ఎంపీడీవో

మాచవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిని ప్రతిఒక్కరు వినిగించుకోవాలని ఎంపీడీవో వెంగళరావు సూచించారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మోర్జంపాడు, మాచవరం సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యంగా సున్నా నుంచి ఆరు సంవత్సరాలు వయస్సు కలిగిన బాలబాలికలను ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు.

మిస్సింగ్ సిటిజన్స్.. గుర్తింపు



- ఎట్టకేలకు ఛేదించిన సచివాలయాల సిబ్బంది
- నాలుగు నెలల క్రితం మూడు జిల్లాల్లో 6.50 లక్షల అన్‌మ్యాపింగ్ ● ఇప్పటికే 6.45 లక్షల మందిని గుర్తించి సచివాలయాలకు మ్యాపింగ్
- ఇంకా 5 వేల మంది ఆచూకీ కోసం వెతుకులాట

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మ్యాపింగ్ జరగని పౌరులను గుర్తించి డేటా సేకరించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తిస్థాయిలో ఆచరణలోకి తీసుకొచ్చారు. కొంతమంది ఇక్కడి సచివాలయాల్లో ఏదో ఒక సర్వీసు పొంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారు. సంపన్నుల నివసించే ప్రాంతాల్లోని ప్రజలు సచివాలయాల్లో మ్యాపింగ్ కావడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. దీని వలన తమ గోప్యతకు భంగం వాటిల్లుతుందని చెబుతూ సర్వేకి వెళ్లిన సిబ్బందిని వెనక్కు పంపేస్తున్నారు. దీంతో మిస్సింగ్ సిటిజన్స్‌ని పట్టుకోవడం కష్టసాధ్యం కాగా వాళ్లని ఏదో ఒక విధంగా ఒప్పించి సమీపంలోని సచివాలయాలకు మ్యాపింగ్ చేశారు. దీంతో పెండింగ్ శాతం 96 నుంచి నేడు 1 శాతానికి తగ్గిపోయింది.

గుంటూరు జిల్లాలో 2 లక్షల 51 వేల 298 మంది పౌరుల యూనిక్ రికార్డులు కనిపించడం లేదు. అలానే పల్నాడు జిల్లాలో 2 లక్షల 2 వేల 328, బాపట్ల జిల్లాలో లక్ష 65 వేల 477 మంది డేటా అందుబాటులో లేదు. దాంతో ఎవరైతే మిస్సింగ్ సిటిజన్స్ ఉన్నారో వారి డేటాని ఇదివరకే సచివాలయాల లాగిన్‌లకు ప్రభుత్వం పంపించింది. ఆ డేటాని సంబంధిత సచివాలయాల కార్యదర్శులు తీసుకొని మిస్సింగ్ సిటిజన్స్ వద్దకు వెళ్లి వారి ఆధార్‌ల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన లింక్/యాప్‌లో నమోదు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. దీని ఫలితంగా ఇప్పటివరకు గుంటూరు జిల్లాలో 2,47,630 పల్నాడులో 2,01,004, బాపట్లలో 1,65,464 మంది మిస్సింగ్ సిటిజన్స్ గుర్తించి మ్యాపింగ్ చేశారు. దీంతో మ్యాపింగ్ ప్రక్రియ గుంటూరులో 1.46 శాతం, పల్నాడులో 0.65, బాపట్లలో 0.01 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నది.

సర్వేల పేరుతో తరచుగా వెళుతుండటంతో ప్రజలు అసహనం

కాగా సర్వేల పేరుతో గతంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లేవారు. ఇప్పుడు ఆ పాత్రని సచివాలయాల కార్యదర్శులు, ఏఎన్ఎంలు పోషిస్తున్నారు. సర్వేకి వెళ్లిన ప్రతీసారి ఆధార్ నంబరు చెప్పమని కోరుతున్నారు. దాని ద్వారా వచ్చే ఓటీపీని చెప్పమంటుండటంతో తమ డేటా ఎక్కడ బయటకు లీక అవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలానే పోష్ ఏరియాల్లో నివసిస్తున్న వారిలో ఎక్కువమందికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందవు. దాంతో తామెందుకు సచివాలయాల్లో మ్యాపింగ్ చేసుకోవాలని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అపార్టుమెంట్‌లు, గ్రూపు హౌసింగ్‌లలోకి తరచుగా సర్వేల పేరుతో వెళ్లి సిబ్బంది విసిగిస్తుం డటం నివాసితులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల అయితే ఎంఎస్ఎంఈ, క్యాన్సర్ స్క్రీనింగ్, పీ4, వర్క్ ఫ్రం హోం వంటి 16 సర్వేలతో ప్రజల వద్దకు సి బ్బంది కొన్ని నెలల వ్యవధిలో వెళ్లారు. తరచుగా సర్వే పేరుతో వచ్చి ఏవేవో ప్రశ్నలు వేస్తూ విసిగిస్తుండటంతో తామెందుకు చెప్పాలని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ ఇందుకేనా తమని మ్యాపింగ్ చేసిందని ప్రశ్నిస్తున్నారు.



సేవలపై సంతృప్తి

ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలపై పెరిగిన భరోసా! ● పనితీరుపై 74.14 శాతం, మందుల పంపిణీపై 79 శాతం సంతృప్తి ● ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలు వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి పని తీరుపై ప్రజల్లో మరింత భరోసా పెరిగింది. ఆసుపత్రి పనితీరుపై సుమారు 75 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల కిందట నిర్వహించిన సర్వేలో 61 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఎస్ఆర్) నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. గతంలో జనవరి 27న, ఫిబ్రవరి 7న, మార్చి ఐదో తేదీన మూడు దఫాలుగా ఐవీఎస్ఆర్ ద్వారా ప్రభుత్వాస్పత్రి పని తీరును తెలుసుకున్నారు. తాజాగా ఏప్రిల్ 7న జరిపిన సర్వేలో గత మూడు సర్వేల కంటే ప్రజల్లో ప్రభుత్వాస్పత్రుల పనితీరుపై సానుకూలత పెరగడం విశేషం. సర్వే వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రితో పాటు రాష్ట్రంలోని ఇతర వైద్య బోధన ఆస్పత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రుల పనితీరును సర్వే ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు.

సర్వే వివరాలు

- ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాట్లో ఉంటున్నారని 74.14 శాతం మంది ప్రజలు తెలిపారు. గతంలో 66 శాతం మంది మాత్రమే వైద్యులు, సిబ్బంది అందుబాట్లో ఉన్నారని చెప్పారు. తాజా సర్వేలో 12.33 శాతం మంది అధికంగా వైద్య సిబ్బంది పనితీరుపై సానుకూలత వ్యక్తం చేశారు.
- ఆసుపత్రిలో డాక్టర్లు రాసిన మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించగా, 67.63 శాతం మంది ఇస్తున్నారని తెలిపారు. గతంలో 57 శాతం మంది మాత్రమే మందులు ఇస్తున్నాని తెలిపారు.
- ప్రభుత్వాస్పత్రిలో అవినీతి ఉందా? అని ప్రశ్నించగా, 41.17 శాతం మంది ఉన్నట్లు చెప్పారు. జనవరిలో నిర్వహించిన సర్వేలో 63 శాతం మంది ఆసుపత్రిలో అవినీతి ఉందని స్పష్టం చేశారు.
- ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్యంపై మాత్రం ప్రజలు పెదవి విరిచారు. గత సర్వేల్లో 60 శాతం మంది పారిశుధ్యం బాగానే ఉందని చెప్పగా, తాజాగా నిర్వహించిన సర్వేలో కేవలం 49 శాతం మంది మాత్రమే పారిశుధ్యంపై సంతృప్తి ప్రకటించారు.
- ఇక జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రుల పనితీరుపై కూడా సానుకూలత వ్యక్తమైంది. డాక్టర్లు, సిబ్బంది అందుబాట్లో ఉంటున్నారని 74 శాతం మంది తెలిపారు. గతంలో కేవలం 47శాతం మంది ప్రజలు మాత్రమే వైద్య సిబ్బంది అందుబాట్లో ఉంటున్నట్లు తెలిపారు.
- ఆసుపత్రుల్లో అవినీతి తగ్గిందన్న వారి సంఖ్య 41 శాతం నుంచి 61 శాతానికి పెరిగింది. డాక్టర్ రాస్తున్న మందులు ఇస్తున్నారని చెప్పిన వారి సంఖ్య 59 నుంచి 79 శాతానికి పెరిగింది.
- జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో పారిశుధ్యం బాగా ఉందని చెప్పిన వారు కేవలం 50 శాతం మంది మాత్రమే. గతంలో 67 శాతం మంది శానిటేషన్‌పై సంతృప్తి వ్యక్తం చేయగా, అది తాజా సర్వేలో 17 శాతం తగ్గిపోయింది.

'మన మోడల్' పాఠశాలగా మార్చుకుందాం

- చినకొండ్రుపాడులో గ్రామ పెద్దల వినూత్న కార్యక్రమం
- 75 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విల్లింగ్ లెటర్స్
- పాఠశాల దత్తతకు ముందుకు వచ్చిన పద్మజారాణి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిని నిలబెట్టుకునేందుకు గ్రామస్థులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి చదువు'కొనే' పరిస్థితుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించేలా ప్రయత్నాలు మొదలయ్యాయి. అందులో బాగంగానే ఇద్దరు, ముగ్గురు విద్యార్థులతో కునారిల్లుతున్న చినకొండ్రుపాడు మెయిన్ పాఠశాలకు ప్రాణం పోసేందుకు ఆ గ్రామానికి చెందిన పద్మజారాణి ముందుకు వచ్చారు. ఆమెకు చినకొండ్రుపాడులోని టీడీపీ నాయకులు ఊతం ఇవ్వడంతో కొద్ది రోజుల్లోనే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు అత్యంత ఆదరణ పెరిగింది. నెల రోజుల వ్యవధిలోనే వివిధ పాఠశాలలకు వెళ్లే సుమారు 75 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ బడికి తమ పిల్లలను పంపుతాం అంటూ విల్లింగ్ లెటర్స్ తీసుకుని విద్యాశాఖ అధికారులకు అందించారు.

గతంలో చినకొండ్రుపాడు మెయిన్ పాఠశాల ఎక్కువ మంది విద్యార్థులతో మోడల్ స్కూల్‌గానే ఉండేది. అయితే గత వైసీపీ హయాంలో 117 జీవో పుణ్యమా అంటూ 3, 4, 5 తరగతులు పక్కనే ఉన్న హైస్కూల్లో కలిసాయి. ఆ తరువాత నుంచి ఈ పాఠశాలలో ముగ్గురు, నలుగురు విద్యార్థులు మాత్రమే ఉంటూ వస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో అసలు పిల్లలు ఉండే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఈ పాఠశాలను ఈ ప్రభుత్వం పూర్తిగా బేసిక్ మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చింది. ఈ క్రమంలో గ్రామ పెద్దలు మోడల్ స్కూల్‌గా మార్చాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేయడం.. అరవై మంది విద్యార్థులు ఉంటేగాని మార్చడానికి వీలు పడదని చెప్పడంతో వారిలో ఆలోచన మొదలైంది. వెంటనే గ్రామానికి చెందిన పద్మజారాణితో పాటు, చినకొండ్రుపాడుకి టీడీపీ నాయకుడు సుబ్బారావు, జడ్పీ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణలు గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో చదువుకునే విద్యార్థుల జాబితాను తయారు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లి దండ్రులను కలుసుకోవడం మొదలుపెట్టారు. ఇందుకోసం కొన్ని రోజులుగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా తమ పిల్లలకు విద్యాబుద్దులు అందించే బాధ్యతను వీరు తీసుకున్నారు. అందరికృషితో ఇప్పటి వరకు వివిధ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే సుమారు 75 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విల్లింగ్ లెటర్స్ తీసుకుని మండల విద్యాశాఖ అధికారులకు అందించారు. రానున్న విద్యాసంవత్సరంలో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడితో పాఠశాల పూర్వ వైభవం సంతరించుకోనుంది.



గ్రామంలో పెద్దలతో కలిసి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పద్మజారాణి

పాఠశాల దత్తత కోసం అర్జీ పెట్టాను : పద్మజారాణి

ముఖ్యమంత్రి ఇచ్చిన పీ-4 పిలుపుతో పాఠశాలను దత్తత తీసుకునేందుకు ప్రభుత్వానికి అర్జీ పెట్టానని పద్మజారాణి తెలిపారు. సంవత్సర కాలంగా ముగ్గురు టీచర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ట్యూషన్లు చెప్పిస్తు న్నామన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను బతికించేందుకుతనవంతు చేయూత అందిస్తానన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు వాహన సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తానని ఆమె తెలిపారు.

బాలయ్య

నటుడు.. నిర్మాత.. దర్శకుడు.. రచయిత..



- సినీ రంగంపై చెరగని ముద్ర
- ఆయన జీవితం గుంటూరుకే గర్వకారణం
- నేడు బాలయ్య జయంతి.... వర్ధంతి

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాత తరం సినీ నటు డు మన్నవ బాలయ్య 1930 ఏప్రిల్ 9న అమరావతి మండలంలోని చావపాడు గ్రామంలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం తెనాలి, మద్రాసు (ప్రస్తుతం చెన్నై)లో జరిగింది. చిన్ననాటి నుండి నాటకాలపై, నటనపై తీవ్రమైన ఆసక్తి కలిగీ ఉండేవారు.

సినీ ప్రయాణం....

బాలయ్య 1953లో ఎత్తుకు పై ఎత్తు అనే చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఆయన సహాయ నటుడిగా, ప్రతినాయ కునిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగుతో పాటు తమిళ చిత్రాలలోనూ నటించారు. అత్యంత విలక్షణమైన నటనతో ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచారు. ఆయన 300లకు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. 1950 నుంచి 1990 వరకు తన నటనతో ఎన్నో అద్భుతమైన చిత్రాలలో నటించి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారు.

ప్రముఖ చిత్రాలు......

ఆయన నటించిన ప్రముఖ చిత్రం మాయాబజార్. ఈ చిత్రంలో ఆయన చేసిన సహనటుడి పాత్ర ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. లవకుశ, దేవత (ఓల్డ్), గుండమ్మ కథ, భక్త ప్రహ్లాదా, మరో చరిత్ర వంటి సినిమాలలో కూడా ఆయన మంచి పాత్రలు పోషించారు.. కేవలం పాతకాలపు చిత్రాలు కాకుండా, 1970, 1980 ల లోనూ మంచి పాత్రలు చేశారు.

నిర్మాతగా కూడా..

బాలయ్య అమృత ఫిలిమ్స్ పేరిట కొన్ని సినిమాలు కూడ నిర్మించారు. ఆయన నిర్మించిన సినిమాలలో నేరము- శిక్ష అత్యంత ప్రజాదరణ పొందింది.

పురస్కారాలు....

ఆయన నటనకు గుర్తింపుగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఎన్నో అవార్డులు అందుకున్నారు. నంది అవార్డు పురస్కారం కూడా ఆయనకు లభించింది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు అనేక అవార్డులు, సన్మానాలు లభించాయి.

మరణం

బాలయ్య 2022 ఏప్రిల్ 9న 92 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద లో టని చెప్పవచ్చు. ఆయన పుట్టిన తేదీ, మరణించినది ఏప్రిల్ 9నే కావడం విశేషం. బాలయ్య సినీ జీవితం నేటితరం నటులకు స్ఫూర్తిదాయకం.

సమ్మె బాటలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

- డీఎంహెచ్‌కు నోటీసు అందజేత

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో)లు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని కలిసి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టీ ప్రవళిక మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారిని క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన మీదటే తాము ఈ ఉద్యోగాల్లో చేరామని తెలిపారు. అయితే ఆ విషయం గురించి అడుగుతుంటే అధికారులు సరిగా పట్టించుకోవటం లేదని, జీతాల పెంపు విషయంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఎఫ్ఆర్ఎస్ పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వివిధ స్థాయిల్లోని అధికారులకు నోటీసులు అందజేసి ఆ తర్వాత సమ్మె చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 16 వ తేదీ నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిపివేయడం ద్వారా నిరసన కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. డీఎంహెచ్‌వోకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పల్లపాటి లింగరాజు, కే సృజన, దీక్షిత, అబ్బుస్ తదితరులు ఉన్నారు.



డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

ఎంఈవోల వసూళ్ల దందా

విధులు విస్మరించి ఇద్దరు అధికారుల ఇష్టారాజ్యం

గుంటూరు(విద్య),ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు ఎంఈవోలకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు వేరు..... ఒకరు పరిపాలనా పరమైన అంశాలకు పరిమితం కావాలని, మరొకరు ప్రభుత్వ పాఠశాలల పనితీరు నిత్యం పర్యవేక్షించి పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలని, నిబంధనలు ఉల్లగించకుండా ప్రైవేటు పాఠశాలల్ని కట్టడి చేయాలనే విధులు ప్రధానమైనవి. అయితే ఈ విధుల్ని విస్మరించి ఇద్దరు ఎంఈవోలు ప్రైవేటు పాఠశాలల నుంచి, భారీ మొత్తాలు వసూళ్ళు చేయడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్ని ఆర్థిక ప్రయోజనాలకు వాడుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదీ గుంటూరు డివిజన్‌లో కీలక నియోజవర్గంలో పనిచేసే ఇద్దరు ఎంఈవోలు చేస్తున్న వసూళ్ళదందా.

ప్రైవేటు పాఠశాలలకు టార్గెట్

నగరంలోని చిన్నా, పెద్ద ప్రైవేటు పాఠశాలలు దాదాపు 150పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్ని ఆకస్మిక తనిఖీ చేయడం అక్కడ నిబంధనలు సరిగా పాటించడం లేదని, పారిశుధ్యం, తాగునీరు, ఉపాధ్యాయులకు సరైన అర్హత లేవనే కారణాలు చూపి భారీ మొత్తంలో ఇద్దరు ఎంఈవోలు దండుకుంటున్నారు. వాస్తవంగా ఇందులో ఒక ఎంఈవో పరిపాలనకే పరిమితం కావాల్సి ఉండగా లేని అధికారాలతో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- ఇటీవల గుంటూరు రూరల్ మండల పరిధిలోని ఓ పాఠశాలకు తనిఖీ కోసం వెళ్ళి చిన్న చిన్న కారణాలు చూపి రూ. 15వేలు ఫైన్ వేశారు. దీంతో సదరు పాఠశాల యాజమాని లబోదిబోమంటూ విద్యాశాఖలోని అధికారుల ముందు తమ గోడు వెళ్ళబోసుకున్నారు.
- నగర పరిధిలోని మరోస్కూల్‌కు తనిఖీలకు వెళ్ళి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఇద్దరు ఎంఈవోలు తమ వద్ద పనిచేసే సీఆర్‌పీలను వసూళ్ళ కోసం వాడుకుంటున్నారు. ప్రతిరోజు సీఆర్‌పీలకు టార్గెట్లు పెట్టి ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల నుంచి రూ. 10వేల నుంచి రూ. 20 వేల వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి వసూళ్ళు చేస్తున్నారు.
- నగర పరిధిలోని జడ్పీ, మున్సిపల్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీఇంబర్స్‌మెంట్ తదితర సర్వీసులకు సంబంధించిన ఫైల్స్ క్లియర్ చేయాలన్నా భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారు.
- నగర పరిధిలోని ఎయిడెడ్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయుల సర్వీస్ మ్యాటర్స్ విషయంలోనూ వసూళ్ళ అపడం లేదు. ఓ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడికి సంబంధించి పెన్షన్ రికార్డుల కోసం దాదాపు రెండు నెలల నుంచి సంబంధిత కుటుంబ సభ్యులు ఎంఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇద్దరు ఎంఈవోల్లో ఒకరు పాఠశాల హెచ్ఎంగా రెగ్యు లర్‌గా పనిచేస్తూ ఎంఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పాఠశాల హెచ్ఎం బాధ్యతల్ని ఇతరులకు అప్పగించి ఆయన వసూళ్ళకే పరిమితం అవుతున్నారని, కనీసం పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌కూడా పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్.....

తన నియోజక వర్గంలో పాఠశాల హెచ్ఎంగా విదులు నిర్వర్తిస్తున్న వ్యక్తికి ఎంఈవో బాధ్యతల నుంచి తప్పించాలని నగర పరిధిలోని ఓ ఎమ్మెల్యే విద్యాశాఖకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన లేఖను విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎంఈవోగా కొనసాగడానికే సదరు హెచ్ఎం ఆసక్తి చూపుతున్నాడని, ఇందుకోసం ఉన్నత స్థాయిలో పైరవీలు సాగిస్తున్నట్లు విద్యాశాఖలో ప్రచారం సాగుతోంది.

బస్టాండ్‌లో ధరల దోపిడీ

- గుంటూరు డిపోలో ఎమ్మార్పీ ఉల్లంఘనలు
- దుకాణాల వద్ద కనిపించని ధరల పట్టికలు
- తాగునీటినీ ప్రయాణికులు కొనుగోలు చేయాల్సిందే...

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు దోపిడీకి గురవుతు న్నారు. కొన్ని తినుబండారాల స్టాల్స్‌లో ఎమ్మా ర్పీను ఉల్లంఘిస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఇటీవల ఆర్టీసీకి చెందిన ఓ యూని యన్ నాయకుడే ధరల దోపిడీకి గురై అధికా రులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆ దుకాణదా రుడికి అధికారు జరిమానా విధించారు. అధికా రులు ఉదాసీన వైఖరి కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి బస్టాండ్‌లో స్టాల్స్ యజమాను లకు అనువుగా మారిందన్న విమర్శలు వినిపి స్తున్నాయి. వాస్తవానికి ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో స్టాల్స్‌లో ధరలు పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. టెండర్‌లో పేర్కొన్న వస్తువులను మా త్రమే సదరు స్టాల్స్‌లో విక్రయించాల్సి ఉంటుం ది. అయినప్పటికీ అటువంటి నిబంధనలు ఏమి అక్కడ అమలు కావటం లేదు. కొన్ని వస్తువు లకు అనుమతులు తీసుకుని అదనపు వస్తువు లను సైతం విక్రయిస్తున్నారన్న విమర్శలు విని పిస్తున్నాయి. కొందరు స్టాల్స్ యాజమానులతో అధికారులు కుమ్మక్కై పట్టీపట్టనట్లు వ్యవహ రిస్తున్నారన్న ఫిర్యాదులూ లేకపోలేదు. రూ. 25ల కూల్ డ్రింక్స్ బాటిల్‌ను రూ. 30లు వసూ లు చేస్తున్నారు. ఇక వాటర్ బాటిల్స్‌లోనూ అంతే అదనంగా వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఫిర్యాదు లు వెల్లువెత్తుతున్నాయి. ఇక బస్టాండ్‌లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం.. ఎండలు మండుతుండటంతో తాగునీరు కూడా వేడిగా ఉండటంతో ప్రజలు చేసేది లేక స్టాల్స్‌లో వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారు. నాసిరకం కంపెనీల వాటర్ బాటిల్స్ పెట్టి ధరలు మాత్రం బ్రాండెడ్ వాటర్ బాటిల్స్ ధరలనే వసూలు చేస్తున్నారు. బస్టాండ్‌లో గతంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లు మూలన పడటంతో పట్టించుకునే నాథుడే లేడు.

కనిపించని తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు

బస్టాండ్‌లో గతంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలతో అప్రమత్తం చేసే వారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. తూనికలు, కొలతల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇక బస్టాండ్‌లోనూ నిరం తరం పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనే జర్ (ఏటీఎమ్) ఇన్‌ఛార్జ్ డిప్యూటీ సీఎమ్‌వోగా వ్యవహరిస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని ఓ స్టాల్

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపో పరిధిలోని చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల ప్రజల నుంచి ఆర్టీసీకి సంబంధించిన సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు గురువారం ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు 99592 25427 ఫోన్ నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ స్కూలులో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడ్డ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి మంగళవారం ఆకాంక్షించారు. దైవానుగ్రహం, ప్రజల ఆశీస్సులతో మార్క్ శంకర్ క్షేమంగా త్వరలో ఇంటికి చేరతాడన్నారు. కుమారుడి ప్రమాదవార్తపై ఆందోళన చెందక ధైర్యంగా ఉండాలని ఆయన పవన్‌ను కోరారు. కేంద్రప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వంతో మాట్లాడి మార్క్‌శంకర్‌కు, అగ్నిప్రమాదంలో గాయపడిన మిగిలిన పిల్లలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మే10న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మే 10న స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా న్యాయ అధికారి ఎన్.సత్యశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు సివిల్ కేసులు, బ్యాంకు, రెవెన్యూ, మోటార్ వాహన ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్, భరణం, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యాలు రాజీద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని సమయాన్ని ధనాన్ని ఆదా చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులను లోకదాలత్‌లో రాజీ చేసుకుంటే కోర్టు ఫీజు వాపసు చేస్తారన్నారు.

'వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి'

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకొని మైనారిటీలలో ఉన్న ఆందోళన అభద్రతా భావాన్ని పోగొట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ, ముస్లిం మైనారిటీ నాయకులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎం.రాధాకృష్ణ, షేక్ నసీరుద్దీన్, షేక్ బాజీ, షేక్ అమానుల్లా, షేక్ ఖాజా బుడే, దావల మరియదాసు, ఎర్రసాని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా మురికిపూడి బోటు వీరాంజనేయస్వామి తిరునాళ్ల

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురికిపూడిలో మంగళవారం బోటు వీరాంజనేయస్వామి వారి వార్షికోత్సవం, తిరునాళ్ల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించి, గ్రామస్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజారమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, కోడె మణి, సాగర్, కందిమళ్ళ హనుమంతరావు, నాగరాజు, చిగురుపాటి రాజాబాబు పాల్గొన్నారు.

రుణమేళా ఇంటర్వ్యూలకు 326 మంది హాజరు

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వివిధ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకుల ఆర్థికాభివృద్ధికి వ్యక్తిగత సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం మొత్తం 840మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పట్టణ పరిధిలోని బీసీ, ఈబీసీ, ఓసీ, కుమ్మరి, మేదర వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. వీరిలో సంబంధిత పత్రాలతో మొత్తం 326మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వివిధ బ్యాంకు శాఖలకు సంబంధించిన మేనేజర్లు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు చేశారు. ఆయా బ్యాంకుల వారు దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి రుణాల మంజూరుపై తుది నిర్ణయం తీసుకుంటారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, మునిసిపల్, మెప్మా సిబ్బంది, వార్డు సంక్షేమ కార్యదరులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం అన్నదానం

వినుకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లెలమూడి అమ్మవారి జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో టి.శేషయ్య దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో 85వ అన్నదాన క్యాక్రమాన్ని నిర్వహించామన్నారు. అదేవిధంగా 82 సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. అనంతరం సంఘంలోని ఐదుగురు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అవ్వారు కోటేశ్వరరావు, జి.నాగేంద్రుడు, పి.నారాయణరావు, గోపి, సుబ్బయ్యశర్మ, ఆదిరాములు, ఎంవీ శర్మ, దీక్షితులు, శంకరరావు, దుబ్బలదాసు, హసన్, రాఘవయ్య, టీవీఎస్ సుందరరావు, కృష్ణమూర్తి, ప్రసాద్, హనుమంతరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ మునిసిపాలిటీ పరిధి విస్తరణ

- గతంలో 2017 ఎకరాలు ఉండగా నేడు 6031.84కు పెంపు
- పలు ప్రాంతాల విలీనానికి సూచన ప్రాయంగా అంగీకారం
- విలీనంతో పురపాలక సంఘానికి పెరగనున్న ఆదాయం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపాలిటీ పరిధిని విస్తరించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో వినుకొండను సమీప ప్రాంతాల్లోని గ్రామాలను వినుకొండ మునిసిపాలిటీలో విలీనం చేస్తామని పాలకులు హామీ ఇచ్చినప్పటికీ నేటికి అది నెరవేర్చిన దాఖలాలు లేవు. వినుకొండ మునిసిపాలిటీ పన్నులు వసూళ్లు చేయడంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. కానీ మునిసిపాలిటీకి ఆదాయ వనరులు సమకూర్చడంలో మాత్రం వెనుకబడి ఉంది. 2005లో మునిసిపాలిటీ ఆవిర్భవించినప్పటి నుంచి వినుకొండ మునిసిపాలిటీ పరిధి 2017ఎకరాలు, 8.16 చదరపు కిలోమీటర్లు మాత్రమే ఉంది. గడిచిన పదేళ్ల కాలంలో వినుకొండ మునిసిపాలిటీ తన పరిధి పెరిగినప్పటికీ ఆదాయం సమకూర్చడంలో మాత్రం వెనుకబడి ఉంది. ఇటీవల లెక్కల ప్రకారం మాస్టర్ ప్లాన్ పరిశీలిస్తే 6031.84 ఎకరాల్లో నూతనంగా వెంచర్లు ఏర్పాటుచేసి తన పరిధిని 24.41 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించినట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమీప ప్రాంతాల్లో నూతనంగా గృహాలు నిర్మించుకున్న యజమానుల వినతి మేరకు వినుకొండ మునిసిపాలిటీ కొన్ని గ్రామాలతో పాటు నూతన వెంచర్లలో ఏర్పాటు చేసిన నివాసగృహాలను విలీనం చేసేందుకు అధికారులు సముఖతను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సూచించిన మేరకు సుమారుగా మునిసిపాలిటీ పరిధి హద్దులు పరిశీలిస్తే వెల్లటూరు రోడ్డులోని బొమ్మరిల్లు, తిమ్మాయపాలెం రోడ్డులోని సర్వే.నెం.927/1 కుడి, ఎడమ వైపు ప్రాంతాలు, మార్కాపురం రోడ్డులోని సర్వే.నెం.944/35 (పసుపులేరు బ్రిడ్జి డాలర్‌సిటీ), ఏనుగుపాలెం రోడ్డులో 446/2 కోటప్పనగర్ సమీపం వరకు, నరసరావుపేట రోడ్డులోని పున్నమి టవర్ హద్దులు గల ప్రాంతాలను వినుకొండ మునిసిపాలిటీలో విలీనం కానున్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు సూచనప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తుంది. ఇటీవల వినుకొండ పర్యటనకు వచ్చిన రీజనల్ డైరెక్టర్ సైతం వినుకొండ ప్రాంతంలోని నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ ప్రాంతాలను కూడా సందర్శించిన నేపథ్యంలో మునిసిపాలిటీలో విలీనం చేయాలని ఆ ప్రాంతవాసులు ఆమెను కోరడం జరిగింది. దీంతో రానున్న రోజుల్లో వినుకొండ మునిసిపాలిటీకి వస్తున్న రాబడికి మించి ఆదాయం పెరగనున్నట్లు మునిసిపల్ సిబ్బంది తెలిపారు. ఇదిలా ఉండగా అనధికార వెంచర్ల క్రమబద్ధీకరణ ద్వారా రానున్న రోజుల్లో నరసరావుపేటకు మించిన పట్టణంగా వినుకొండ మునిసిపాలిటీగా ఆవిర్భవించనున్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.



వినుకొండ మునిసిపాలిటీ పరిధి మ్యాప్

రైతుల ప్రయోజనాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం రాజీపడదని, వారి ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నియోజకవర్గంలోని నాగార్జున సాగర్ ప్రధాన కాలువ పరిధిలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ (పీబీసీ కెనాల్) తుర్లపాడు, ఎన్ఆర్ మేజర్ కాలువల్లో పూడిక, కంపచెట్ల తొలగింపు పనులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ముందుగా యడ్లపాడులోని పీబీసీ కాలువ వద్ద పూజలు నిర్వహించి, టెంకాయ కొట్టిన అనంతరం ఆయన ఎస్కవేటర్‌ను నడిపి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోటి వ్యయంతో ప్రధాన మేజర్లలో 24చోట్ల పూడికతీత పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. ఏదో మొక్కుబడిగా కాకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహించాలన్నారు. రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పనులు జరగాలన్నారు. తొలగించిన కంపచెట్లను అక్కడే వదిలి వేయవద్దని, ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు జరుగుతున్న పనులను నిత్యం పరిశీలించాలన్నారు. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని కాంట్రాక్టర్‌ను, అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించగా నెల వ్యవధిలో పూర్తిచేస్తామని వారు సమాధానమిచ్చారు. పనులు పూర్తయ్యాక మరలా పరిశీలిస్తానని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే తిరిగి కాంట్రాక్టర్‌తో సరిగా చేయని పనులను చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ డీఈఈ శ్రీనివాసరావు, మూడు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కంప చెట్ల తొలగింపు పనులను టెంకాయకొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం దొండపాడులో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. రైతులు సాగుచేస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటలను పరిశీలించి మార్క్‌ఫెడ్ ద్వారా తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడం జరుగుతుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం దొండపాడులో తడిచిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో గదులను పరిశీలిస్తున్న వనజ, పద్మారావు

పాఠశాల గదులను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

రొంపిచర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో గదులను రాష్ట్ర పరిశీలకులు వనజ, పల్నాడు జిల్లా ఏఎస్‌వో, సీఎంవో పద్మారావు మంగళవారం పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లను అందించనున్నారు. ఇందుకు గాను షూస్, బెల్టు, యూనిఫాం, టెస్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, డిక్షనరీలు భద్రపరచాల్సి ఉంది. దీనిపై వివరాలను ఎంఈవో బ్రహ్మేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, డీఈవో దావులూరి మస్తాన్‌రావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సొసైటీ అధికారులు, నాయకులు

120మంది రోగులకు వైద్యపరీక్షలు

కారుమంచి (శావల్యాపురం) ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా సహకారశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని కారుమంచి సొసైటీ ఆధ్వర్యంలో లైబ్రరీ సెంటర్‌లో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కారుమంచి, గంటుపాలెం సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీలు శ్రీదేవి, శోభారాణి పాల్గొని 120మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేశారు. కారుమంచి సొసైటీపర్సన్ ఇన్‌చార్జి నర్రా సురేంద్రబాబు, సీఈవో యేరువ వెంకటనారాయణ వైద్యశిబిరాన్ని సందర్శించి రోగులకు మందులు పంపిణీ చేశారు. సురేంద్రబాబు మాట్లాడుతూ 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, స్టాఫ్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న మానవ సేవా సమితి నాయకులు

నిరుపేదకు ఆర్థికసాయం

వినుకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మానవ సేవా సమితి ఆధ్వర్యంలో పేద మహిళ నాగమల్లేశ్వరికి రూ.10వేలు ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు పి.వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చామర్తి భవాని శంకర్‌లు మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో పట్టణంలో చెట్లు నాటే కార్యక్రమం విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యుడు టంగుటూరి లక్ష్మీనారాయణ, వైశాలి సుబ్రహ్మణ్యం, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలంటూ
పరిశ్రమల శాఖ కార్యాలయం వద్ద నిరసన

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపార రుణాలు ఇప్పిస్తానని ప్రజల వద్ద డబ్బు వసూలు చేసి మోసం చేస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయ ఉద్యోగిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం నరసరావుపేటలోని జిల్లా పరిశ్రమ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పల్నాడు పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఐపీవోగా పనిచేస్తున్న కొమ్మిశెట్టి రాజశేఖర్ సత్తెనపల్లి పట్టణానికి చెందిన గాదం శ్రీనివాసరావుకు ప్రింటింగ్ ప్రెస్ వ్యాపారం చేసుకోవడానికి లోను ఇప్పిస్తానని నమ్మించి రూ.40వేలు తీసుకున్నాడని ఆరోపించారు. తీరా లోను ఇప్పించకుండా మోసం చేశాడని, ఇదేమని అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నాడన్నారు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు గాదం శ్రీనివాసరావు జిల్లా పరిశ్రమల శాఖ ఆఫీసులో అధికారికి గతంలో అర్జీ ఇచ్చినప్పటికి ఎలాంటి చర్యలు లేవన్నారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జీ రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వీ కోటనాయక్, బీసీ సంఘంనాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళల అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు నరసరావుపేట ఎక్సైజ్ సీఐ కే సోమయ్య మంగళవారం తెలిపారు. నకరికల్లు మండలంలోని చేజర్లలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారారహిత గ్రామాలే నవోదయం 2.0 లక్ష్యమన్నారు. నాటు సారా తయారు చేయడం విక్రయించడం నేరం అన్నారు వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు గ్రామాలను నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న నడికట్టు రామిరెడ్డి

కష్టపడితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

● గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళలోని కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డిల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివిన గ్రామీణ విద్యార్థులు ఈ రోజున ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. నాణ్యమైన విద్య, లక్ష్యం భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానానికి వెళ్ళాలన్న లక్ష్యంతోనే గ్రామంలోని పాఠశాలలకు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వంతోపాటు దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామానికి, పాఠశాలకు పేరు, ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులకు జామెంట్రీలు, పరీక్ష సామగ్రి తదితరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరిముల్లా, ఉపాధ్యాయులు కే.శ్రీనివాసరావు, యన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాఫర్‌కు అంబేద్కర్ ప్రతిభ అవార్డు

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు షేక్ జాఫర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. సదరన్ ప్రైవేట్ ఉపాధ్యాయ, అధ్యాపక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు.

నవమి పందిళ్లను సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటుచేసిన శ్రీరామ నవమి పందిళ్ళను మంగళవారం స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. బాలాజీ సంఘం, స్టీల్ దుకాణాల వీధి, మైదానం వీధి, గౌడ వీధి, బోస్ రోడ్, షరాఫ్ బజార్‌లలో జరిగిన శ్రీరామనవమి పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. నవమి ఉత్సవాలకు చిలకలూరిపేట పెట్టింది పేరని, పట్టణంలోని అన్నివర్గాలు కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో వ్యవహరిస్తూ శ్రీరామనవమిని ఎన్నోఏళ్ల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. చలువ పందిళ్ల వద్ద మంచినీరు, మజ్జిగ సౌకర్యం కల్పించిన నవమి వేడుకల నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్ ఖాన్, కనమర్లపూడి రమేష్, లక్ష్మీ తిరుమల, అమరా రమాదేవి పాల్గొన్నారు.



ఆయుర్వేద వైద్య శిబిరంలో రోగులకు మందులు అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

300 మందికి ఆయుర్వేద వైద్యసేవలు

● రూ.3 లక్షల విలువ చేసే మందుల పంపిణీ

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక రాధాకృష్ణ ఆయుర్వేద ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. సుమారు 300మంది రోగులు శిబిరానికి హాజరై బీపీ, షుగర్, ఈసీజీ ఇతర పరీక్షలు చేయించుకున్నారు. ఆయుర్వేద డాక్టర్ పి.మురళీకృష్ణతో పాటు మరో నలుగురు డాక్టర్లు వచ్చిన రోగులను పరీక్షించి వారికి సుమారు రూ.3 లక్షల విలువ చేసే ఆయుర్వేద మందులను ఉచితంగా అందచేశారు. శిబిరంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, కె.బుచ్చిబాబు, డాక్టర్ పి.చెన్నకేశవాచార్యులు, డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నిరసన

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహించే లైసెన్స్ దుకాణ యజమానులపై చర్య తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేసి, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, ఒక్క బొల్లాపల్లి మండలంలోనే సుమారు 300వరకు బెల్ట్ షాపులు ఉన్నాయన్నారు. రేమిడిచర్ల, వెల్లటూరు, బొల్లాపల్లిలో లైసెన్స్ తీసుకున్న షాపుల యాజమానులే వాహనాల ద్వారా తండాలకు, గ్రామాలకు మద్యంను సరఫరా చేస్తున్నారని అన్నారు. ఎక్సైజ్ శాఖ సూపరిటెండెంట్ వినతిపత్రం ఇచ్చేటప్పుడు మీడియాను అనుమతించకపోవడాన్ని ఖండించారు. ఎక్సైజ్ అధికారులు, రాజకీయ నాయకులు, బెల్ట్ షాపులు అరికట్టడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, వసంతరావు, బాదుగున్నల శ్రీనివాసరావు, థామస్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



శావల్యాపురంలో నీటితొట్టి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ బూసిరెడ్డి

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్ల నిర్మాణం

● ఉపాధి హామీ పథకం ఏపీడీ బూసిరెడ్డి

శావల్యాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పొలాలకు వెళ్ళే పశువులకు తాగునీటిని అందుబాటులో ఉంచి దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నీటితొట్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని ఏపీడీ బూసిరెడ్డి అన్నారు. మండలంలోని ఇర్లపాడు, శావల్యాపురం గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లను ఏపీవో రామారావుతో కలసి మంగళవారం పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.62వేలు కేటాయించిందని, మండలంలోని శావల్యాపురం, మతుకుమల్లి, శానంపూడి, ఇర్లపాడు గ్రామాల్లో నీటితొట్ల నిర్మాణాలు చేపట్టగా శావల్యాపురం, ఇర్లపాడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయని, శానంపూడి, మతుకుమల్లి గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. కారుమంచి, కొత్తలూరు, కనమర్లపూడి, చిన్నకంచెర్ల, బొందిలిపాలెం గ్రామాల్లో నీటితొట్ల నిర్మాణాల కోసం నివేదికలను పంపామని, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్రారంభిస్తామన్నారు. పశువులు పొలాలకు వెళ్ళే మార్గాల్లో గ్రామానికి చివరన బావిగానీ, బోరు వద్దగాని నీటి లభ్యత ఉంటే నీటితొట్టి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు అన్నవరపు వెంకటేశ్వర్లు, చెరుకూరి బాలకృష్ణ పాల్గొన్నారు.